కథ

# మనసు చెప్పిన కథ

## 2 మే, 1974.

''ఎన్ని సరదాల అగరువత్తులు వెలిగించుకున్నాను. ఎంత కాంక్షా శ్రీగంధమ్ము పైనలది కొన్నాను...''

అని తిలక్ అన్నట్టు భవిష్యత్తుపై ఎన్ని ఆశలు, ఎన్ని కాంక్షలు! ఆడుతూ పాడుతూ హాయిగా సాగిన కాలేజీ జీవితం ముగిసింది. చదువు పూర్తయింది కాబట్టి ఇంట్లో పెళ్లి ప్రయత్నాలు మొదలు.

'పెళ్లంటే ఒక సందడి, ఒక సంతోషం' అన్నారు తాపీవారు. నిజమేనా? లెటజ్ వెయిట్ అండ్ సీ!

26 మే, 74.

ఎంగేజ్‌మెంట్ జరిగిపోయింది. జీవితమంటే చదువు, పుస్తకాలు, సినిమాలు, పాటలు, సాహిత్యమే కాదు, ఇంకా చాలా వుంది సుమా అంటుంది ఈ పెళ్లి హడావుడి.

28 జూన్, 74.

రంగురంగుల దీపాలు, మల్లెపూల పందిరి, మంగళ తోరణాలు, సన్నాయి మేళాలు, వేద మంత్రాలు, మంగళ సూత్రాలు, మూడుముళ్ళు, రాగ బంధాలు, ఆశీస్సులు, అక్షింతలు, దీవెనలు, శ్రీరామర క్షలు... అంగరంగ వైభవంగా పెళ్లి జరిగిపోయింది.

నౌ అయామ్ మిసెస్ సంధ్యా సుధాకర్!

2 జూలై, 74.

కొత్త వాతావరణం, కొత్త మనుషులు...అత్తగా రింట్లో పద్ధతులు, స్వభావాలు నాకు నచ్చలేదనే చెప్పాలి. ఒక ప్లానింగ్, ఒక పద్ధతి, ఒక బాధ్యత..ఇవేవీ ఈ ఇంట్లో, ఈ మనుషుల్లో కనిపించడంలేదు. జీవితం ఎందుకో ఇరుకుగా వున్నట్లనిపిస్తోంది. ఎక్కడో ఏదో అసంతృప్తి, ఏమిటో అంతా అనీజీనెస్. సమ్‌థింగ్ డిఫ

**డబ్బు లేకపోవడమే దరిద్రం అనుకుంటారు చాలామంది. కాదు. డబ్బు లేకపోవడం దరిద్రమూ కాదూ, దురదృష్టమూ కాదు. మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవడం దరిద్రం. మన ప్రేమని స్వీకరించేవాళ్ళు లేకపోవడం దరిద్రం. ఆ దరిద్రం, ఈ దరిద్రం పుష్కలంగా అనుభవిస్తున్నాను. బ్రతుకు నరకప్రాయంగా లేదా సంధ్యా? నిండా మునిగాక చలేమిటీ అంటావా?**

రెంట్.

20 జూలై, 74.

నా భర్త మంచివాడేగానీ చాలా ఈజీ గోయింగ్ నేచర్. జీవితంపట్ల ఒక కమిట్‌మెంట్‌గానీ, సీరియస్‌నెస్ గానీ అతనిలో లేవు. టైమ్‌సెన్స్ అంతకన్నా లేదు. అత నేమిటో అర్థం అవుతున్నకొద్దీ మతిపోతోంది.

15 ఆగస్టు, 74.

కొత్త జీవితంలోకి, కొత్త ప్రపంచంలోకి ప్రయాణం సాగుతోంది. సంజ రంగులతో ఆకాశం క్షణానికోసారి మారినట్లు ఎన్ని రంగులు, ఎన్ని అనుభవాలు కలిస్తే జీవితం? జానపద కథల్లోలా మాయాలాంతర్లు, భవిష్యత్తును చూపే అద్దాలు, నిజ జీవితంలో కూడా వుంటే ఎంత బాగుండును? ఎన్నివేల, లక్షల జీవితాలు బలి అవుతున్నాయో ఈ పెళ్ళనే లాటరీలో.

3 మే, 75.

మాతృత్వపు మధురానుభూతులు మనసారా ఆస్వాదిస్తున్న క్షణాలు ఎంత అపురూపమైనవి. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డని కళ్లారా చూసుకోవడంకన్నా ఒళ్ళోకి తీసుకోవడం కన్నా మధురానుభూతి ఒక స్త్రీకి ఇంకేముంటుంది? సంధ్య అనే అమ్మాయి అమ్మ అయింది.

28 ఆగస్టు, 75.

ఈ మనిషికి మరీ ఇంత బాధ్యతారాహిత్యమేమిటి? బాధ్యతలని మనసారా మోయడంలోని ఆనందం ఒకళ్లు చెబితే తెలిసేదా? పెళ్లంటే ఒక బాధ్యత. పెళ్లంటే ఒక బంధం. అవునుకదా! పెళ్లంటే ఏమిటి? పెళ్లి మంత్రాలకు అర్థం తెలియకుండానే చాలామంది పెళ్ళిళ్ళు చేసేసుకుంటారు. ఎదుటి వ్యక్తి జీవితాన్ని నాశనం చేస్తారు.

15 అక్టోబర్, 75.

పాపాయితో ఎలా కాలం గడుస్తోందో తెలియడమే లేదు. నా పతిదేవుడికి ఇల్లు వాకిలి పట్టదు. పాపకి తల్లితోపాటు తండ్రినీ నేనే అయ్యాను. నాకంటూ ఓ చిన్ని ప్రపంచం పూర్తిగా తయారైపోయింది. అలాగే నేను చాలా ఆశాజీవిని. అలా అని బోలెడు ఆశలు పెట్టుకున్న దాన్నికాదు. అందుకే నేనింకా ఇలా ఆనందించగలుగుతున్నానేమో! ఈ గజిబిజి జీవితం నుంచి మార్పు రాక పోదు. అప్పుడింకా ఆనందించకపోను.

1 జనవరి, 1976.

ఎంతో అందంగా, పొందికగా అమర్చుకున్న నా కలల ప్రపంచం అంతా ఇలా బద్దలైపోయిందేమిటి? సినిమాలు, షికార్లు, సరదాలు, సంతోషాలు...కావాల్సిన వయసులో నాలో నేనే ఒదిగిపోయాను. ఒక ఒంటరి ప్రపంచంలో సమాధి అయిపోయాను. స్తబ్దత ఆవరించిన నిర్నిద్ర నిశీథ సామ్రాజ్యానికి అంకితమైపోయాను.

20 మే, 76.

ఇదీ అని చెప్పలేని ఏదో బాధ. అతని వాలకం చూస్తుంటే అయోమయంగా వుంటోంది. ఏమిటో మనిషి? ఉద్యోగమో, వ్యాపారమో చేసి డబ్బు సంపాదించకుండా ఖాళీగా కూర్చుని డబ్బు ఖర్చు పెట్టడానికే పుట్టాను సుమా అన్నట్లు వుంటాడు. బాధ్యత, క్రమబద్ధమైన జీవితం, మనిషికి ఒక వ్యక్తిత్వాన్ని, ఒక వన్నెను తెస్తుందన్న చిన్న సత్యం కూడా ఇతనికి తెలియదనుకోవాలా?

30 నవంబర్, 76.

కట్టలేని ఇంటి అద్దె, బాకీపడ్డ పాల బిల్లు, నిండుకున్న సరుకులు, ఖాళీ కడుపులు, ఇదేమిటీ? ఇతనికి చీమ కుట్టినట్టయినా వుండదు. ఉద్యోగమో, వ్యాపారమో చేసి సంసారాన్ని సజావుగా నడపమని ఒకరు చెప్పాలా? చెప్పించుకోవాలా?

9 ఫిబ్రవరి 77.

'డబ్బులేనివాడు డుబ్బుకైనా కొరగాడని' పుట్టింట్లో కూడా నా బ్రతుకు చులకనైపోయింది. విలువలేకుండా పోయింది. ఒక మనిషిలోని క్వాలిఫికేషన్స్ అన్నీ వివాహం సమూలంగా నాశనం చేయగలదన్న నిజం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

20 ఆగస్టు 77.

''నీ అంత దురదృష్టవంతురాలు ఈ లోకంలో వుండదు'' అంది అక్క. నిజమే కావచ్చు. కానీ ఆ మాటలు నా మనసుని హర్ట్ చేసాయి. 'దురదృష్టాన్ని అదృష్టంగా మార్చుకునేందుకు పట్టుదల కావాలి. అప్పుడే సాధించగలవు' అని ధైర్యం చెప్పడంలోనూ, 'నీ అంత దురదృష్టవంతురాలు లేదనడం'లోనూ తేడా లేదూ?

2 జనవరి, 1978.

డబ్బులేని వాళ్ళు మనుష్యులు కారా? ఎందుకు వీళ్ళు నన్ను ఆప్యాయంగా పలకరించరు? ఎందుకు ఆత్మీయతని పంచరు? అందులోనూ నా పరిస్థితి చూస్తూ కూడా! పుట్టింటికెళ్లినప్పుడు ఆ టైమ్‌లో అక్క అక్కడే వుంటే 'నేను వున్న టైములోనే ఎందుకు వస్తావు? తర్వాత రావచ్చుగదా'' అని ఈమధ్య తరచూ విసుక్కుంటోంది. ఆకలిదప్పులు భరించాను. భర్త బాధ్యతారాహిత్యాన్ని సహించాను. ఇది భరించే శక్తి మాత్రం నాకు రావడంలేదు. ఆప్యాయతల్ని, అనుబంధాల్ని కొలిచేది కూడా డబ్బే అన్న నిజాన్ని ఎలా జీర్ణించుకోను?

18 నవంబర్, 78.

కాలం గడుస్తోందేగానీ గమ్యం కనిపించడంలేదు. కంటి కొలనుల్లో జారే కన్నీళ్ళకీ, గుండె పొరల్లో రగిలే ఆవేదనలకీ అంతేలేదు. కాలం అన్ని వైపులనుండీ

కత్తులు దూస్తోంది. ఏమిటిది? జీవితం ఎందుకిలా నా నుండి జారిపోతోంది? నేనేమైపోతున్నాను?

10 జూలై, 1980.

ఇంటి బాధ్యత మొత్తం నా లేత భుజాలమీదకెత్తుకుని చాలా రోజులే అయింది. అత్త, మామలకి చీకూ చింతాలేదు. కొడుకు ఖాళీగా కూర్చున్నాడన్న దిగులు లేదు. అంతా చూస్తూ కూడా పట్టనట్టే వుంటారు. భగవంతుడు వెరైటీ కోసం విచిత్రమైన మనుషుల్ని ఇలా అప్పుడప్పుడు సృష్టిస్తుంటాడు కాబోలు.

10 ఫిబ్రవరి, 1981.

డబ్బు లేకపోవడమే దరిద్రం అనుకుంటారు చాలా మంది. కాదు. డబ్బు లేకపోవడం దరిద్రమూ కాదు, దురదృష్టమూ కాదు. మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవడం దరిద్రం. మన ప్రేమని స్వీకరించేవాళ్ళు లేకపోవడం దరిద్రం. ఆ దరిద్రం, ఈ దరిద్రం పుష్కలంగా అనుభవిస్తున్నాను. బ్రతుకు నరకప్రాయంగా లేదా సంధ్యా? నిండా మునిగాక చలేమిటీ అంటావా?

28 ఆగస్టు, 81.

డబ్బు లేకపోవడమన్నది నాకెప్పుడూ నిరుత్సాహాన్ని కలిగించలేదు. అది లేకపోయినా ఫర్వాలేదుగానీ నన్ను బాధించేది ఒంటరితనం. మనిషిని మనిషి మనసారా ఆప్యాయంగా పలకరించడానికి కూడా స్టేటస్, డబ్బు ఇంకా చాలా చాలా ఉండాలేమో! ఈ మనుషులకెందుకూ ఇంత స్వార్థం? హిపోక్రసీ లేకుండా జీవించలేరా? అసలు మనం ఎవరినైనా ఎందుకు బాధపెట్టాలి? ఆఫ్టాల్ మనం జీవించేది ఎంతకాలం? అంతలోనే కోపతాపాలు, కక్షలూ, కార్పణ్యాలు, స్వార్థాలు, మోసాలు, ఇవన్నీ నాన్సెన్స్ కదూ!

4 మార్చి, 1982.

ఒక్కోసారి జీవితం మీద నాకు విరక్తి కలుగుతుంది. అలా అని నాకు మరణించాలనీ లేదు, జీవించాలని కూడా లేదు. అదీ ఇదీ గానీ అనిశ్చిత, అల్లకల్లోలం. ఎస్! అయామ్ ఫుల్ ఆఫ్ కాంట్రడిక్షన్స్...చావడం, బతకడం రెండూ పరస్పరమైన భావాలు, బాధ్యతల బరువు మోయవలసి వచ్చినందుకు కాదు ఈ విరక్తి. మనసారా పలకరించే వాళ్ళు లేకపోవడాన్ని మించిన విరక్తి, బాధ ఇంకేముంటాయి?

5 మే, 1983.


చావాలని చాలాసార్లు అనిపించింది. ఎందుకు బ్రతకాలన్న డిప్రెషన్. పాపని చూస్తుంటే మరణించే హక్కు నాకు లేదనిపించింది. నా చిన్నారి జీవితాన్ని మొగ్గలోనే తుంచేసి నా మానాన నేను నిష్క్రమించడం నేరంకదూ? ఎంత కష్టమైనా ఎంత బాధనైనాసరే ధైర్యంగా బ్రతుకుతాను. పాపని ప్రయోజకురాల్ని చేస్తాను.

28 ఫిబ్రవరి, 1985.

పిచ్చి సంధ్యా! ఎవరూ నీవారు కాదని, ఎవరూ నీకు లేరని ఎందుకు బాధపడతావు? అలా చూడు, ఈ చిరుగాలి నీ కోసమే వీస్తోంది. ఆ పువ్వులు నీ కోసమే పరిమళాలు వెదజల్లుతున్నాయి. నీ కోసమే చంద్రుడు వెన్నెలలు కురిపిస్తున్నాడు. నక్షత్రాలలో మెరుస్తున్న నీలాకాశం నిన్నే ఆప్యాయంగా పరికిస్తోంది. ఈ ప్రకృతి సమస్తం నీ ఎదుటే, నీ వెంటే వుంది. ఇంక నువ్వు ఒంటరివి ఎలా అవుతావు?

9 ఫిబ్రవరి, 1986.

తగులుతున్న దెబ్బలు సామాన్యమైనవికావు. నిబ్బరించుకుని నిలబడగలగడం అనుకున్నంత తేలిక కాదు. అయినా తప్పదు. అసాధ్యాన్ని సాధ్యం చేసుకోవాలి. నా సంసారాన్ని నిలబెట్టుకోవాలి. గమ్యం చేరుకోవడానికి కావాల్సింది ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం! సో సంధ్యా! బి బ్రేవ్!



20 జూన్, 1987.

అంతు దొరకని సమస్యల పెనుతుఫానుకు ఉక్కిరిబిక్కిరై ఊపిరైనా అందక విలవిల లాడినప్పుడు ఒక ఆత్మీయమైన స్పర్శలా ఈ ప్రకృతి, ఈ సాహిత్యమే నన్ను సేదదీర్చాయి. ఓదార్చాయి. ఎంతో బలాన్నిచ్చాయి. జీవిత

**విశారద**

సత్యాలను విప్పిచెప్పాయి. శూన్యాన్ని ఛేదించి చీకటిని తరిమి కొట్టమని బోధించాయి. సరికొత్త స్ఫూర్తిని చ్చాయి. అందుకే సాహిత్యం నా ప్రాణం.

10 సెప్టెంబర్, 1988.

ఎవరూలేక ఏ ఒక్కరూ కలిసిరాక కాల తీరాన ఒంట రిగా నడిచాను. మమతలకీ, మమకారాలకీ నోచుకోక బీడునై మోడునై ఎండిపోయాను. ఎన్నోసార్లు చావు బతు కుల సరిహద్దురేఖమీద నిలబడి ఊగిసలాడాను. వెన్నెల రాత్రి భావుకతామృతాన్ని బంగారు దోసిళ్ళతో తాగి అమర జీవినయ్యాను. ఇక మరణం ఎలా సంభవం? వీళ్లకెవరికీ తెలీదు. నా మనసు నుండి జలజల కురి సింది అమృతమని.

12 జూలై, 1989.

అనుక్షణం ఏదో ఒక పాఠం...ఎన్ని నేర్చుకున్నాను? ఎన్ని ఓర్చుకున్నాను? అడుగు తర్వాత అడుగు వేస్తూ జీవితాన్ని ఆశతో వెలిగించుకుంటూ పొడిగించుకుంటూ ధీమాగా నడిచిపోతూనే ఉన్నాను. అవును! నిశ్శబ్ద ప్రయాణమైతేనేమి, ఒంటరి బ్రతుకైతేనేమి. దిగులును తోసుకుంటూ మునుముందుకు నడవకపోతే భవిష్యత్తు వుండదుకదా!

16 నవంబర్, 1990.

సంధ్యా! నీకు డబ్బు లేకపోవచ్చుగానీ నీ జీవితంలో జీవించడం వుంది. ఒక నిజాయితీ వుంది. ఒక పట్టు దల వుంది. ఒక దీక్ష, తపస్సు ఉన్నాయి. మనసులో ఇంకిపోని ఆర్తి, ఆర్ద్రతా ఉన్నాయి. నీకు నీవే సాటి సంధ్యా! ఎవరూ నిన్ను గుర్తించకపోయినా, ప్రశంసించక పోయినా నీ అంతరాత్మని నేను చెబుతున్నాను కదా!

10 డిసెంబర్, 1991.

సంపాదనలేని భర్తని ఇంట్లోంచి వెళ్లిపొమ్మనాలట. ఇంట్లో పెట్టుకుని ఇలా పోషించకూడదట. అంతా నన్నే తప్పు పడుతున్నారు. మనిషిలో మార్పు అతన్ని శిక్షించి నప్పుడే వస్తుందా? అతన్ని ఎప్పుడూ నేను భర్తలా చూడలేదు. ఒక బిడ్డలా చూసుకున్నాను. ఒక తల్లిలా ఆదరించాను. ఒక అద్దె ఇంట్లో నాలుగు రోజులు వుండి వెళ్లిపోతుంటేనే బాధనిపిస్తుంది. అలాంటిది, కలసి కొన్నాళ్ళు కాపురం చేసాక, అతను నాకేమీ కానట్టు ఎలా బైటికి పంపేయాలి? ఎవర్కైనా ఎలా మన సొప్పుతుంది? ఒడ్డున కూర్చుని సలహాలు చెప్పడం చాలా తేలికనుకుంటా!

తర్కంకన్నా ఆర్ద్రత, వాత్సల్యం గొప్పవి కదూ? తర్కం బుద్ధికి సంబంధిం చినది. ఆర్ద్రత మనసుకే సంబంధించి నది. నేనెంచుకున్నది రెండో తోవ. నేను చేసింది, చేస్తున్నది తప్పో ఒప్పో...ఏదైనా కానీ ఆ భగవంతుడు నాకు మంచిగా ఆలోచించే వివేకాన్ని, విచక్షణనీ ఇచ్చాడని నేను నమ్ముతున్నాను. ఒక మనిషి తన తప్పుకి ఎప్పుడు ఎలాంటి శిక్ష అనుభవి స్తాడో నాకు తెలియదుగానీ ప్రేమించడం మాత్రమే తెలిసిన నా కళ్ళు అన్నిటినీ క్షమించే నా మనసు అతనికెప్పుడూ శిక్షే! క్షమని మించిన శిక్ష మరే ముంటుంది మనిషికి?

1 జనవరి, 1992.

బ్రతుకంటే ఏమిటో, అసలు ఎందుకు బ్రతకాలో, ఎలా బ్రతకాలో, దేనికోసం బ్రతకాలో తెలియజెప్పింది ఈ మనుషులే, ఈ జీవితమే ఈ ప్రపంచమే అన్నింటికి మించి నా భావుకత్వమే! థాంక్స్ టు ఎవ్విరీథింగ్!

6 ఫిబ్రవరి, 1993.

ప్రపంచం మొత్తం ఒకవైపు, నేనొక్కదాన్నే ఒకవైపు వుండి పోరాటం సాగిస్తున్నట్లుగా వుంది. పరిస్థితులతో పాటు మనుషులు ఎదురు తిరిగితే ఎంతకాలం ఈ ఎదు రీత? నిలువనివ్వకుండా కూర్చోనివ్వకుండా తరిమి కొడుతున్న వీళ్లందరి ముందు జీవితాన్ని రక్షించుకోవా లన్న అనంతమైన ఆరాటం, ఆశ...వీటినే ఆయుధంగా చేసుకుని విధితో పోరాడటానికి ఎంత వేదనని దిగమిం గుకోవాలి. ఎంత ధైర్యాన్ని కూడగట్టుకోవాలి?

24 అక్టోబర్, 93.

పాప నా కలల ప్రతిరూపంలా, నా వ్యక్తిత్వానికి ప్రతి బింబంలా ఎదిగింది. చదువు పూర్తి కావస్తోంది. నా గమ్యం అతి చేరువలో వుంది. పిరికితనంతో భయపడి నేను జీవితం నుండి పారిపోలేదు. ధైర్యంతో అడుగు ముందుకే వేసాను. మై డియర్ సంధ్యా! నీకు జీవితమం టేనూ తెలుసు, దాన్ని ఉన్నతంగా చేసుకోడవమూ తెలుసు. అందుకే ఒంటరిగా, ధీమాగా నడుస్తున్నావు. గుడ్. కీపిటప్!

2 ఆగస్టు, 94.

దుఃఖాన్ని, సంతోషాన్ని రెంటిని సమాన స్థాయిలో స్వీకరించగలిగే మానసిక స్థితికి మనిషి చేరుకోగలిగితే ఎంత బావుంటుంది? తినగ తినగా వేము తీయనవు తుంది. నడుస్తున్న కొద్దీ దూరం దగ్గరవుతుంది. అనుభ వించినకొద్దీ కష్టం సుఖమవుతుంది.

24 అక్టోబర్ 95.

జీవితంలో వేదనకూ, ఆవేదనకూ, ఆర్ద్రతకూ, ఆక ర్షణకు, వికర్షణకు, ఘర్షణకు అద్భుత రూపకల్పన నేనే, నా కథే. ఎంత చేదైనా వాస్తవాన్ని, అనివార్యమైన వాటిని అంగకరించక ఆహ్వానించక తప్పదు. అయినా, ఓ భయంకర జీవితాన్ని ముఖాముఖి ఎదుర్కోవడం ఎంత కష్టం. చీకటి తప్ప ఏమీ కనిపించని బ్రతుకులో ధైర్యమే ఒక దీపం!

2 జూలై 1977.

నా చిట్టితల్లి చదువు పూర్తయింది. కొన్నేళ్లుగా నా సుదీర్ఘ తపస్సు ఫలించింది. ఎందుకు బ్రతికానో, దేని కోసం బ్రతుకుతున్నానో...ఆ కోరిక నెరవేరింది. నిన్నటి కన్నీళ్ళు నేటి ఆనందబాష్పాలుగా కురుస్తున్న క్షణాలివి.

28 ఫిబ్రవరి, 1999.

గమ్యాన్ని చేరుకున్న క్షణాలు ఇంత ఆనందంగా వుంటాయని నాకు తెలియదు సుమా! పెళ్లి పీటలమీద నా బంగారు తల్లిని పెళ్లికూతురిగా చూసుకున్న నాలో తృప్తికి అంతులేదేమో! ఆనాడు తొందరపడి నా బ్రతు కును ముగించుకుని నా దారి నేను చూసుకుని వుంటే నా చిన్నారి ఏమైపోయి వుండేది?

''ఇతడెన్నియో యుద్ధముల నారితేరిన వృద్ధ మూర్తి'' అని మహాభారతంలో భీష్మాచార్యను ఉద్దేశించి తిక్కన అంటాడు. నీ జీవన సమరంలో ప్రాణాలొడ్డి నిల బడి నువ్వు ఆ స్థాయికెదిగావు సంధ్యా!

ఎలాంటి జీవితమెదురైనా ఛాలెంజ్‌గా అడుగు ముందుకే వెయ్యాలని నీకు ఎవరూ నేర్పలేదు. ఎవరూ చెప్పలేదు. నీ అనుభవాలే నీ గురువు.

నీ జీవితం ఎందరికో స్ఫూర్తినివ్వాలి సంధ్యా. ఈ లోకంలో ఇంకా కొన్ని వందల వేల సంధ్యలుంటారు. అలాంటి వారందరికీ నీ జీవితం ఒక ఆదర్శం కావాలి. జీవితమంటే పరిహాసమూ, నిర్లక్ష్యమూ, బాధ్యతారాహి త్యమూ కాదని, జీవితమంటే వ్రతమనీ, తపస్సు అనీ, బాధ్యతనీ, మనిషిని మనసునీ హాయిగా నిలకడగా నిలిపే జీవ రసాయనమనీ, నీలాగే ప్రతి వ్యక్తీ తెలుసుకో వాలి.

కష్టం ఎదురైనప్పుడు పిరికితనంతో బ్రతుకు ముగిం చడం కాదు. ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేసిన నాడు జీవితమూ వెలుగుతుంది. మరికొన్ని జీవితాల్ని వెలిగిస్తుంది.

''పత్థర్ కహాగయా, షీషా కహాగయా, దిల్ జైసే ఏక్ చీజ్‌కో క్యాక్యా కహాగయా'' (పాషాణం అన్నారు, సున్నితమైన గాజు అన్నారు, చిన్ని గుండెను ఎన్నెన్ని అన్నారో)

అలా అన్నవాళ్లంతా నిన్ను తలెత్తి చూస్తే గానీ కనిపించనంత ఎత్తుకు ఎదిగావు. కంగ్రాట్స్ సంధ్యా! నవ్వుతుంటున్నావా!

ఎప్పుడూ అలా నవ్వుతూనే ముందుకు సాగిపో. నీ నవ్వు కొన్నివేల బ్రతుకుల్ని వెలి గించాలి. ఆ వెలుగులో వాళ్లు పయనిం చాలి. కష్టాలూ, కన్నీళ్ళూలేని కొత్త ప్రపంచం రావాలి అంటోంది నా మనసు.

☆

